

# అతనికంటే ఘనుడు!

-చింతా జగన్నాథరావు

"ఇహ ఇంటర్వ్యూలకు బ్రేక్ ఇద్దామా? భోజనాల సమయం అయింది" అంటూ తన సీట్లోంచి లేవబోయాడు జనరల్ మేనేజర్.

"ఉన్నది ఇంకొక్కరే సార్. అది కూడా అయిపోతే మధ్యాహ్నం మళ్లీ కూర్చోనక్కర్లేదు" అన్నాడు పర్సనల్ మేనేజర్. తరువాతి అభ్యర్థి లోపలకు వస్తూనే తనను పరిచయం చేసుకున్నాడు 'ఐయామ్ రమేష్' అంటూ.

"కూర్చోండి" అని జిఎం చెప్పాక ఒద్దిగ్గా కూర్చున్నాడు. చురుకైన చూపులు, నీటుగా టక్ చేసిన షర్టులోంచి కండలు తిరిగిన శరీరం దరఖాస్తు పత్రంలోని వివరాల ప్రకారం వయసు ఇరవై తొమ్మిది అయినప్పటికీ కాలేజీ నుంచి బయటకొచ్చిన యువకుడిలా ఉన్నాడు.

"మీరు ప్రారంభించండి" ప్రొడక్షన్ మేనేజర్ని ఉద్దేశించి అన్నాడు జియం.

అభ్యర్థికి సంబంధించిన ఇంజనీరింగ్, కంప్యూటర్ విద్యార్హతలు, ప్రముఖ ఎరువుల ఉత్పత్తి కర్మాగారంలోని ఏడు సంవత్సరాల అనుభవం గూర్చిన వివరాలు అప్పటికే ఆయన పరిశీలించాడు. సాంకేతిక విషయాలపై నిశితమైన ప్రశ్నలు వేసి, రమేష్ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. పూర్తి సంతృప్తి వ్యక్తం చేసారు.

చివరగా పర్సనల్ మేనేజర్ మాట్లాడుతూ "రమేష్ యు ఆర్ సెలెక్టెడ్. వెల్కమ్ టు అవర్ ఆర్గనైజేషన్" సంస్థ ఇవ్వదలచిన జీతభత్యాలు, సౌకర్యాలు వివరంగా కూడా చెప్పాడాయన. ఇవ్వజూపిన జీతం మాత్రం రమేష్ మాట అటుంచి ఇంటర్వ్యూ బోర్డు సభ్యులకే మరీ తక్కువ అనిపించింది.

"రమేష్ ఇప్పుడు నీ ఉద్యోగం ఎక్కడో ఉత్తరాదిన. అదీ ప్రైవేట్ సంస్థలో. మా సంస్థలో జాయిన్ అయితే స్వంత రాష్ట్రంలో మీ స్వంత ఊరికి దగ్గరగా ఉండవచ్చు. ఇక జీతం సంగతి అంటావా ఒకసారి ప్రాజెక్ట్ పూర్తయితే ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభం అవగానే జీతాలు అందరివీ సవరిస్తారు. నీకు ఇంతకన్నా ఎక్కువే వస్తుంది అప్పుడు. నువ్విప్పుడు కార్మిక వర్గానికి చెందిన వాడివి. మేము ఇవ్వబోతున్నది ఆఫీసర్ పోస్ట్. నీకు తెలియని రహస్యం ఒకటి చెప్తాను. మాలాంటి ప్రభుత్వరంగ సంస్థలలో ఆఫీసర్ల ప్రయోజనాలకు పెద్దపీట వుంటుంది. జీతాలు అడక్కుండానే పెరుగుతాయి. ఇంక్రిమెంట్లు, రేట్లూ, ఏదో ఒక రూపంలో అందే బోనస్లు అధికమే. కార్మికుల్లా ఆందోళనలు, సమ్మెలు, ధర్నాలు సుదీర్ఘమైన చర్చలు, బేరసారాలు అవసరం ఉండదు. జనరల్ మేనేజర్ పదవివరకూ రెండేళ్లకు ఒకసారి క్రమం తప్పని ప్రమోషన్లు ఉంటాయి. అధికారికంగా విమానయానాలు, విదేశీయాత్రలు కూడా. బాగా ఆలోచించుకో" తను చెప్పేదేమీ ఇక లేదన్నట్లు మాటలు ఆపి నర్మగర్భంగా నవ్వాడు పర్సనల్ మేనేజర్. ఆయన తీరు బోర్డు సభ్యులెవ్వరికీ నచ్చడం లేదు. కేవలం తక్కువ జీతానికి ఒప్పించే ప్రయత్నంలో అభ్యర్థితో యాజమాన్యాలు ఆంతరంగిక విషయాలు మాట్లాడడం వాళ్లకి ఏమాత్రం రుచించడంలేదు. ఆయనదో వింత మనస్తత్వం. పరిశ్రమలోని అనేక కర్మాగారాలలో ఉన్న తన స్థాయి టెక్నికల్ అధిపతుల్లా ముప్పై ఏళ్ల తను అనుభవంలో తనెంత తక్కువ జీతాలు పొందినదీ పోలికలు తెస్తాడుగానీ వర్తమానం గమనించడు, విశాలంగా ఆలోచించడు.

"సరే... మీ ఇష్టం. అప్పాయింట్మెంట్ ఆర్డర్ పంపండి" అంటూ లేచాడు.

రమేష్ నిష్క్రమించాక "చూసారా! ఎంత బెట్టు చేసాడు గురుడు? స్వంత ఊరు, ఆఫీసర్ కాబోతున్నావు అని ప్రలోభ పెడితేగాని లొంగాడుకాదు. మొత్తం మీద మన సంస్థకి కనీసం నెలకి వెయ్యి రూపాయలు మిగిల్చాను నేను."

***

"కంగ్రాచ్యులేషన్స్ సార్. ఇంటర్వ్యూ ఇంత సేపు జరిగిందంటే మీరు సెలెక్ట్ అయినట్టే. ఎప్పుడు జాయిన్ అవబోతున్నారు?" ఇంటర్వ్యూకి వచ్చేందుకు అయిన ట్రైన్ ఖర్చులు ఇస్తూ రిసెప్షనిస్టు అడిగింది రమేష్ను.

ఓ నవ్వు నవ్వి ఊరుకున్నాడు రమేష్. 'పాపం... ఈ అమ్మాయికి తెలియదు బాలారిష్టాలు గడిచి బట్టకడుతుందోలేదో అని పరిశ్రమ వర్గాలలో ఇప్పటికే ప్రచారం జరుగుతున్న ఈ కంపెనీలో చేరేంత తెలివితక్కువవాడిని కాననీ, తను ఈ సిటీకి వచ్చింది మేనకోడలి పెళ్లి సందర్భంలోనని, ఇంటర్వ్యూకి హాజరు అయింది ప్రయాణపు ఖర్చులు కలిసి వస్తాయని.'

★